www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING CURE - PURE - RARE

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:56 TUESDAY ,JULY 07,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 56 మంగళవారం 07 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-




## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు

### దేశ ప్రజలకు బీజేపీ క్షమాపణలు చెప్పాలన్న పొన్నం



హంసకలం వార్త :

అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో కోట్ల రూపాయల భారీ అవినీతి జరిగిందంటూ తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ ఎదుగుదల కోసం దేవుడిని వాడుకోవడంలో బీజేపీ పరాకాష్ఠకు చేరిందని మండిపడ్డారు. - మిగతా2లో

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ..

# సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- పర్యాటక రంగం పై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష
- తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- తారామతి బారాదరి, దుర్గం చెరువు అభివృద్ధికి ఆదేశాలు
- వికారాబాద్, వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధి పై దృష్టి
- మరిన్ని ఎకో పార్కులు, ఫ్యూచర్ సిటీలో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు
- పురానాపూల్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రతిపాదన



హంసకలం వార్త :

తెలంగాణ పర్యాటక శాఖ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కీలక చర్యలు చేపట్టారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం క్యాంపస్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై వారికి కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాల పై ఫుల్ ఫోకస్ పెట్టారు ముఖ్యమంత్రి. గొల్కొండ సమీపంలోని తారామతి బారాదరిని టూరిజం ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. - మిగతా2లో

## కేసీఆర్.. తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలి: మంత్రి పొంగులేటి



హంసకలం వార్త :

మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నేతలపై తెలంగాణ రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాం లోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వం పై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. - మిగతా2లో

## హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం.. రంగంలోకి ఉన్నతాధికారులు



- ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిన ప్రాజెక్టు పై అధికారుల దృష్టి
- అనుమతులు లేవని స్పష్టం చేసిన ఇరిగేషన్ శాఖ
- నిర్మాణ స్థలాన్ని సంయుక్తంగా తనిఖీ చేసిన ఉన్నతాధికారులు
- విచారణ తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడి

## కాళేశ్వరం అవినీతి పై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు: రాంచందర్ రావు



హంసకలం వార్త :

జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తదితర నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. - మిగతా2లో


# అదానీ పై కేసు పెట్టాల్సింది కాదు




హంసకలం వార్త :

భారత్‌లో ప్రాజెక్టుల కోసం భారీగా లంచాలు ఇచ్చారని, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు పెట్టి ఉండాల్సింది కాదని అమెరికా న్యాయశాఖ పేర్కొంది. అసలు ఈ వ్యవహారంలో అమెరికా జాతీయ భద్రతకుగానీ, పెట్టుబడిదారులకుగానీ పైసా నష్టం జరగలేదని స్పష్టం చేసింది. - మిగతా2లో

## అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం



హంసకలం వార్త :

అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ రాజీనామా ను ట్రస్టు బోర్డు ఆమోదించింది. చంపత్ రాయ్ స్థానంలో బజ్రంగ్ బాగ్రా - మిగతా2లో

## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. వర్చువల్‌గా కోర్టుకు హాజరైన అల్లు అర్జున్



హంసకలం వార్త :

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసుకు సంబంధించి టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ సోమవారం నాంపల్లి క్రిమినల్ కోర్టు ఎదుట వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కేసులో మరికొందరు నిందితులు విచారణకు గైర్హాజరు కావడంతో, న్యాయస్థానం తదుపరి - మిగతా2లో

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ పై తీర్పు రిజర్వ్



- బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
- భగీరథ్‌కు బెయిల్ ఇవ్వొద్దని బాధితురాలి తరపు న్యాయవాది వాదన
- సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వివరణ
- నిందితుడు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని ప్రాసిక్యూషన్ వాదన

# అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

ముఖ్యంగా హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు ముఖ్యమంత్రి. గొల్కొండ సమీపంలోని తారామతి బారాదరిని టూరిజం ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని డెవలప్ చేసి యాదాద్రి తరహాలో ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులను తీర్చిదిద్దాలని ఆజ్ఞాపించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, ఆ ప్రాజెక్టుల కోసం ప్రత్యేక అధికారిని నియమించి పనులను ముమ్మరం చేయాలన్నారు. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవకాశం ఉంటే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలన్నారు ముఖ్యమంత్రి. డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పైనా కసరత్తు ప్రారంభించాలని, సమ్మిట్ కోసం శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా, ఈ సమీక్షా సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి హాజరయ్యారు.

# కేసీఆర్.. తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలి: మంత్రి పొంగులేటి

సోమవారం సిద్దిపేట జిల్లా ములుగులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రపంచంలో ఉన్న ఏడు వింతలు కాదని.. ఎనిమిదో వింత కాళేశ్వరమని ఆనాడు చెప్పిన పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. కాళేశ్వరం ఎలా కట్టారో చెప్పాలని, కేసీఆర్ తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని పేర్కొన్నారు.

**చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నాం..**

రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఇవ్వలేక పోయిన వాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇస్తామని.. వారికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఏ పార్టీల్లోని లబ్ధిదారులైనా.. పైరవీ లేకుండా చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట గజ్వేల్, సిరిసిల్ల, నియోజకవర్గాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అత్యధికంగా కట్టుకున్నారని చెప్పారు. వేరే నియోజకవర్గాల్లో అరకొరగా 50, 60 ఇళ్లు కట్టి అసంపూర్తిగానే వదిలేశారని తెలిపారు. రెండోవిడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వ్యాఖ్యానించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించామని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. వర్చువల్‌గా కోర్టుకు హాజరైన అల్లు అర్జున్

ఈ కేసులో మరికొందరు నిందితులు విచారణకు గైర్హాజరు కావడంతో, న్యాయస్థానం తదుపరి విచారణను జులై 29కి వాయిదా వేసింది. 2024 డిసెంబర్ 4న 'పుష్ప 2: ది రూల్' చిత్ర ప్రత్యేక ప్రదర్శన సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాటలో రేవతి (35) అనే మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ బాలుడు సుదీర్ఘకాలం పాటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన చిక్కడపల్లి పోలీసులు, భద్రతా లోపాలు మరియు నిర్వాహకుల వైఫల్యాలను గుర్తించారు. ఈ మేరకు 2025 డిసెంబర్‌లో న్యాయస్థానానికి 500 పేజీల చార్జిషీట్‌ను పోలీసులు సమర్పించారు. ఇందులో అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా పేర్కొన్నారు. ఈ కేసులో థియేటర్ యాజమాన్యంతో పాటు, బన్నీ బౌన్సర్లు సహా మొత్తం 23 మందిని నిందితులుగా పేర్కొన్నారు. సోమవారం జరిగిన విచారణ సమయంలో అల్లు అర్జున్ ముంబైలో షూటింగ్‌లో ఉండటంతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు కోర్టు అనుమతించింది. అప్పట్లో ఘటన జరిగిన అనంతరం అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయగా, ఆ తర్వాత ఆయనకు మధ్యంతర బెయిల్ లభించింది. బాధితురాలి కుటుంబానికి అల్లు అర్జున్, ఆయన కుటుంబ సభ్యులు మరియు 'పుష్ప-2' చిత్రబృందం ఆర్థిక సహాయాన్ని అందించారు.

# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ పై తీర్పు రిజర్వ్

పోక్సో కేసులో అరెస్టైన బండి భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై తెలంగాణ హైకోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టును కోరారు. నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో కేసుపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. ఇంకా పలువురు సాక్షులను విచారించాల్సి ఉందని తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరైతే వారిపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. భగీరథ్ జైలులో ఉంటేనే దర్యాప్తు పారదర్శకంగా సాగుతుందని పేర్కొన్నారు. మరోవైపు పేట్‌బషీరాబాద్ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌లో కీలక అంశాలను ప్రస్తావించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసిన తర్వాత ఆరోపణల తీవ్రత దృష్ట్యా అభియోగాలను సవరించినట్లు కోర్టుకు వెల్లడించారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం పెంచుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు.

# అదానీ పై కేసు పెట్టాల్సింది కాదు

భారత్‌లో ప్రాజెక్టుల కోసం భారీగా లంచాలు ఇచ్చారని, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు పెట్టి ఉండాల్సింది కాదని అమెరికా న్యాయ శాఖ పేర్కొంది. అసలు ఈ వ్యవహారంలో అమెరికా జాతీయ భద్రతకుగానీ, పెట్టుబడిదారులకుగానీ పైసా నష్టం జరగలేదని స్పష్టం చేసింది. అదానీ గ్రూప్ అమెరికాలో భారీగా పెట్టుబడులకు సిద్ధమైనందునే కేసు ఉప సంహరించు కుంటున్నారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ఈ మేరకు అమెరికా జాతీయ (ఫెడరల్) కోర్టులో తాజాగా అఫిడవిట్ దాఖలు చేసింది. అంతేకాదు లోపభూయిష్టమైన ఈ కేసును పూర్తిగా ఉపసంహరించు కోవాలన్న తమ నిర్ణయాన్ని సమీక్షించడంలో కోర్టు పాత్ర కూడా పరిమితమేనని పేర్కొంది.

**భారీగా లంచాలు ఇచ్చారనే ఆరోపణలతో కేసు**

అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, మరో ఏడుగురిపై 2024లో బైడెన్ ప్రభుత్వ హయాంలో అమెరికా న్యాయశాఖ కేసు నమోదు చేసింది. వారు భారత ప్రభుత్వ అధికారులు, నేతలకు సుమారు రూ.2,300 కోట్లు(250 మిలియన్ డాలర్లు) లంచాలు ఇచ్చి భారీ ప్రాజెక్టులు పొందారని.. వాటితో పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించి వేల కోట్లు సమీకరించారని ఆరోపించింది. ఆ సమయంలో అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా పెట్టుబడిదారుల నుంచి సుమారు రూ.1,700 కోట్లు (175 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు సమీకరించిందని పేర్కొంది. అమెరికా పెట్టుబడిదారుల ప్రయోజనాలు ముడిపడి ఉన్న దృష్ట్యా అదానీ వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఫెడరల్ కోర్టును కోరింది. ఈ వ్యవహారం అప్పట్లో కలకలం రేపింది. అయితే బైడెన్ దిగిపోయి ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి చేపట్టాక..ఈ వ్యవహారం మెత్తబడింది. ఆ కేసును ఉప సంహరించుకుంటామని ఫెడరల్ కోర్టుకు అమెరికా న్యాయశాఖ కొన్ని నెలల క్రితమే నివేదించింది. కారణాలను వివరిస్తూ న్యాయశాఖ తాజాగా 10 పేజీల అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఈ కేసు విచారణ చట్టపరంగా లోపభూయిష్టమని, దౌత్యపరంగా ప్రతికూల ప్రభావం చూపుతుందని అఫిడవిట్‌లో అమెరికా న్యాయశాఖ ప్రిన్సిపల్ అసోసియేట్ డిప్యూటీ అటార్నీ జనరల్ ట్రెంట్ మెక్‌కాటర్ వివరించారు. "కేసును పూర్తిగా ఉపసంహరించుకోవాలన్న న్యాయశాఖ నిర్ణయాన్ని సమీక్షించడంలో కోర్టు అధికారం కూడా పరిమితమే" అని మెక్‌కాటర్ తెలిపారు. కేసు ఉప సంహరణకు కారణాలను వివరిస్తూ.. అదానీపై ఆరోపణలకు సంబంధించిన వ్యవహారమంతా భారత్‌లోనే జరిగిందని, భారత అధికారులు దర్యాప్తు చేపట్టి చర్యలు చేపట్టాల్సినంత తప్పులేమీ లేవని తేల్చారని మెక్‌కాటర్ పేర్కొన్నారు. కేసులో పేర్కొన్న సాక్ష్యాలు, ఆధారాలన్నీ విదేశాల్లో(భారత్‌లో) ఉన్నాయని, ఆరోపణలను నిరూపించడంలో ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటి నేపథ్యంలో కేసు ఉపసంహరణకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. అంతేకాదు అమెరికా ప్రపంచానికే పోలీసు అన్నట్టు వ్యవహరించడం దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు. విదేశాల్లోని వ్యవహారాలతో వనరులను వృధా చేసుకోవడం కంటే.. అమెరికా అంశాలపై దృష్టిపెట్టడం మంచిదని పేర్కొన్నారు.

# కాళేశ్వరం పేరుతో కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారు

మాజీ మంత్రి కేటీఆర్ పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం పేరుతో ఆయన డ్రామాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజల పై ప్రేమ లేదని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉండి ఆయన ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాం లోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా..? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు.

## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు

దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా రామయ్య గుడి కోసం విరాళాలు ఇస్తే, కమలం పార్టీ నేతలు ఆ సొమ్మును కూడా వదలకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. "బీజేపీ నాయకులు శ్రీరాముడి పేరును, అక్షింతలను అడ్డం పెట్టుకుని ఇళ్ల వెంట తిరిగి విరాళాలు వసూలు చేశారు. తీరా చూస్తే ఆ నిధుల్లోనే కోట్లాది రూపాయల అవినీతికి తెరలేపారు. దేవుడి హుండీలోని సొమ్మును సైతం లూటీ చేయడం దేశ ప్రజలందరినీ అవమానించడమే" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల అసలు రంగును, వారి అవినీతి అక్రమాలను అక్కడి స్థానిక ప్రజలు ముందే గుర్తించారని... అందుకే అయోధ్య పరిధిలోని లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిని అక్కడి ఓటర్లు ఓడించి బుద్ధి చెప్పారని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. భక్తి వేరు, రాజకీయం వేరని స్పష్టం చేసిన మంత్రి... ఈ విరాళాల కుంభకోణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లదే పూర్తి బాధ్యతని అన్నారు. దేవుడి పేరుతో సాగించిన ఈ పెద్ద స్కాంపై బీజేపీ తక్షణమే స్పందించాలని, దేశ ప్రజలందరికీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో రాజకీయ వ్యాపారం చేసే శక్తులను ప్రజలు ఇకనైనా గుర్తించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం.. రంగంలోకి ఉన్నతాధికారులు

హైదరాబాద్ నగరానికి తలమానికమైన హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో అక్రమ నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలపై అధికారులు దృష్టి సారించారు. నీటిపారుదల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఓ నిర్మాణాన్ని చేపడుతోందని ఫిర్యాదులు రావడంతో సోమవారం ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల నేతృత్వంలోని బృందం నిర్మాణ స్థలాన్ని సంయుక్తంగా తనిఖీ చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తమ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు జారీ చేయలేదని నీటిపారుదల శాఖ స్పష్టం చేయడంతో ఈ తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణానికి సంబంధిం చిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, పూర్తి స్థాయి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టే నిర్మాణాలపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. హైదరాబాద్ నగరానికి చారిత్రక, పర్యావరణ వారసత్వంగా ఉన్న హుస్సేన్ సాగర్‌ను సంరక్షించడం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

## కాళేశ్వరం అవినీతి పై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు: రాంచందర్ రావు

దేశ సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు మరువలేనివని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాల పై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయని మండి పడ్డారు. జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ అవినీతిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మరోవైపు హైడ్రా కూల్చివేతల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని... ఎంఐఎం నేతలకు చెందిన ఫాతిమా విద్యాసంస్థల అక్రమ కట్టడాలపై కోర్టులు తప్పుబట్టినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్-ఎంఐఎం దోస్తీ వల్లే ఈ పక్షపాతమని... హైడ్రా అందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని, లేనిపక్షంలో విపక్షాల అక్రమాలపై రాష్ట్ర వ్యాప్త పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

## అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం

ప్రస్తుతం బాగ్రా విశ్వహిందూ పరిషత్ ఇంటర్నేషనల్ జనరల్ సెక్రటరీగా ఉన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ అయిన ఆయన గతంలో ప్రభుత్వ రంగ సంస్థ నాల్కోకు కూడా నేతృత్వం వహించారు. ఆర్థిక రంగం, పరిపాలనలో ఆయనకు ఉన్న అనుభవం ట్రస్టు నిర్వహణకు విశేషంగా ఉపయోగపడుతుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. పరిపాలన, ఆర్థిక అంశాలపై మంచి పట్టున్న వారిని రంగంలోకి దింపే ప్రయత్నంలో బాగ్రాకు ఈ బాధ్యతలు దక్కినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. చంపత్ రాయ్ జనరల్ సెక్రటరీ పదవి నుంచి తప్పుకున్నప్పటికీ ట్రస్టీగా కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక, జనరల్ సెక్రటరీగా బాగ్రా పేరును ప్రకటించేందుకు కొంత సమయం పడుతుందని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. జులై 19-20 తేదీల్లో జరగనున్న వీహెచ్‌పీ ద్వైవార్షిక సమావేశాల్లో ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. విరాళాల చోరీ ఉదంతం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో చంపత్ రాయ్‌తో పాటు అనిల్ మిశ్రా అనే ట్రస్టీ కూడా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు తమ రాజీనామాలు సమర్పించారు. ఈ కేసుపై ప్రస్తుతం సిట్ దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సిట్ తన ప్రాథమిక నివేదికను సమర్పించింది. విరాళాలను లెక్కించే సిబ్బంది నిధులను ఎలా దారి మళ్లించారనే విషయాలను తన నివేదికలో పేర్కొంది.

హంస కలం వార్త HAMSA KALAM VARTA
మంగళవారం 07 జూలై 2026


# సంపాదకీయం

## పాత కథ మీద కొత్త ప్రశ్నలు

తెలుగు కథాసాహిత్యంలో కొన్ని రచనలు మొదట చదివినప్పుడు మనకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తాయి. అవి జీవన విధానాన్ని సహజంగా, అందంగా, ప్రశాంతంగా మన ముందు ఉంచుతాయి. కానీ కాలం మారిన కొద్దీ, అదే రచనలను కొత్త సామాజిక దృష్టితో తిరిగి చదివితే, ఒకప్పుడు ప్రశ్నాతీతంగా కనిపించిన విలువలు కొత్త ప్రశ్నలుగా మన ముందు నిలబడతాయి. సత్యం శంకరమంచి రాసిన 'అమరావతి కథలు' పుస్తకంలోని 'ఒక రోజెళ్ళిపోయింది' కథను ఈమధ్య మళ్లీ చదువుతుంటే నాకు ఒక ప్రశ్న తలెత్తింది: 'ఒకప్పుడు ఆదర్శంగా కీర్తించబడిన ఈ కథలోని జీవన విధానం, మారిన సామాజిక విలువల వెలుగులో నేటికీ ఆదర్శంగా నిలబడుతుందా?' అని. ఈ మూడు పేజీల కథ అమరావతిలోని పూజారి పిచ్చయ్య గారి దైనందిన జీవితాన్ని చిత్రీకరిస్తుంది. ఆయన నిశ్శబ్ద స్వభావం, గుడికి వెళ్లి మంత్రం బయటకు వినిపించకుండా పూజ ముగించడం, గుడి ప్రాంగణంలోని చెట్లు, పువ్వులు, గాలిగోపురంపై వాలే పావురాలు --- ఇవే ఆయన ప్రపంచం. ఇంట్లో భార్య సీతమ్మ గారి జీవితం ఆయన అవసరాల చుట్టూ తిరుగుతుంది. చివరికి ఆయన నిద్రలోనే కన్నుమూస్తారు. ఆ నిశ్శబ్ద జీవి పరమ నిశ్శబ్దంలో కలిసిపోవడాన్ని రచయిత ఉదాత్తంగా చిత్రీకరించారు. కథ ప్రారంభం నుంచి ముగింపు వరకు 'నిశ్శబ్దం' అనే భావాన్ని క్రమబద్ధంగా నిర్మించి కథనాన్ని నడిపించారు. ఒక రచనను దాని కాలపు సామాజిక పరిస్థితులతో అర్థం చేసుకోవడం అవసరమే. అయితే, వర్తమాన విమర్శనాత్మక దృష్టితో తిరిగి పరిశీలించడం కూడా అంతే ముఖ్యం. ఈ కథలో కనిపించే కుటుంబ నిర్మాణం, వంశపారంపర్య ఆధ్యాత్మిక అధికారం, గ్రామీణ సమాజంలో కొన్ని వర్గాలకు లభించిన జీవన స్థిరత్వం -- ఇవన్నీ ఇరవయ్యవ శతాబ్దం మధ్యకాలపు తెలుగు సమాజ విలువలను ప్రతిబింబిస్తాయి. పిచ్చయ్య గారి జీవితం వంశపారంపర్య వృత్తితో ముడిపడి ఉంది. ఇతర అర్చకులు జీవన సమస్యలు, ధరల గురించి మాట్లాడుతుంటే, ఆయన పావురాలను లెక్కపెడుతూ కూర్చోవడం కేవలం వైరాగ్యం మాత్రమే కాదు; లౌకిక ఒత్తిడుల నుంచి దూరంగా ఉండగలిగే స్థితి కూడా. ఆయన జీవన నిర్మాణం ఆయనకు ఒక రకమైన అనుకూలతను కల్పించి ఉండవచ్చు. కానీ కథ ఆయన జీవితాన్ని స్తుతిస్తూ మహిమ పరచడం ద్వారా చుట్టూ ఉన్న స్థితిగతులను కావాలనే విస్మరిస్తుంది. ఒక్క కథ మొత్తం సమాజానికి ప్రాతినిధ్యం వహించకపోయినా, చుట్టూ ఏ అంశాలను ఆ కథ విస్మరించిందో చర్చకు తీసుకురాబోవటం అప్రస్తుతం కాదు. ఈ కథలోని ప్రశాంత జీవితం శతాబ్దాలుగా సాగిన కుల ఆధారిత శ్రమ విభజన కొన్ని వర్గాలకు కల్పించిన ప్రత్యేక సామాజిక హక్కుల ఫలితంగా చూడవచ్చు. భారతీయ సామాజిక నిర్మాణంలో కొన్ని వర్గాలు ఆధ్యాత్మిక అధికారంతో స్థిరమైన స్థానం పొందగా, మరికొన్ని వర్గాలు దేహశ్రమతో అస్థిర జీవనంలో మిగిలిపోయాయి. మనుగడ సంక్షోభాలు తక్కువగా ఉన్నప్పుడు చుట్టూ ఉన్న అసమానతలను ప్రశ్నించాల్సిన అవసరం కూడా తక్కువవుతుంది. ఈ కథలో చిత్రించిన ప్రశాంతత స్వయంసిద్ధంగా ఏర్పడలేదు. ఊళ్ళో దేవాలయం నడపడం, ఇంట్లో ఆహారం సిద్ధం చేయడం-- ఇవన్నీ అనేక చేతుల శ్రమపై ఆధారపడి ఉన్న విషయాలు. కానీ ఈ కథలోని కథనం ఈ శ్రమలను అదృశ్యం చేస్తుంది. పాఠకుడికి కనిపించేది కేవలం ఒక వ్యక్తి ప్రశాంతత మాత్రమే. కథలో పిచ్చయ్య గారు గుమ్మం నుంచి "పచ్చడేమిటి?" అని అడిగితే దొడ్లోంచి సమాధానం వస్తుంది. భోజనం తర్వాత నులక మంచంపై వాలితే భార్య సీతమ్మ కాళ్లకు ఆముదం రాస్తుంది. ఆ కాలంలో ఇది ఆమెకు 'ధర్మం'. ఆమె శ్రమ కుటుంబ జీవనానికి పునాది అయినా, కథనం దాన్ని స్వయంప్రతిపత్తి కలిగిన కృషిగా చూడదు. భర్త మరణానంతరం సీతమ్మ బొట్టు చెరుపుకుని "ఆయన నాలోనే ఉన్నారు" అని సరిపెట్టుకోవడం స్త్రీ అస్తిత్వాన్ని పురుషుడి కోణం నుంచే చూడాల్సిన సామాజిక కట్టుబాటుకు పరాకాష్ఠ. కథలో ఒకే రకమైన చర్యల పునరావృత్తి --- భర్త పూజకు వెళ్లడం, భార్య ఇంటిపనుల్లో మునగడం --- ఇవి సహజమైన, ప్రశ్నించరాని జీవన క్రమంగా చిత్రించబడుతుంది. దీర్ఘకాలం కొనసాగిన అలవాట్లను ఒక విలువగా, వాటి పునరావృత్తిని ధర్మంగా మార్చే సమాజ విధానం కథలో అంతర్లీనంగా కనిపిస్తుంది. ఈ కథలో చిత్రించిన ఆధ్యాత్మికత వ్యక్తిని సామాజిక వాస్తవాల నుంచి దూరంగా ఉంచే అంతర్ముఖ జీవన రూపాన్ని ఆదర్శంగా ప్రతిపాదిస్తుంది. పిచ్చయ్య గారి జీవనశైలి సామాజిక వాస్తవాలతో ప్రత్యక్ష సంబంధం లేకుండా, సొంత అంతర్ముఖ ప్రపంచానికి పరిమితమైనట్లు కనిపిస్తుంది. గొప్ప రచన కాలం మారినా కొత్త ప్రశ్నల మధ్య విమర్శను ఆహ్వానిస్తూ తన ప్రాసంగికతను నిలబెట్టుకుంటుంది. యాభై ఏళ్ల క్రితం భర్త కాళ్లు నొక్కడం 'ఆదర్శ గృహిణి' లక్షణంగా కనిపించినా, నేడు అది స్త్రీ స్వాతంత్ర్యాన్ని పరిమితం చేసిన విలువల భాగంగా అనిపిస్తుంది. కాలం మారినప్పుడు మన విలువల కొలమానాలు కూడా మారతాయి. ఈ కథలో దాదాపు ఎలాంటి సంఘర్షణ కనిపించదు. కుటుంబంలో విభేదాలు లేవు, సమాజంలో ఉద్రిక్తత లేదు, వ్యక్తిలో అంతర్గత కలత లేదు. జీవితం సహజ సమతుల్యతగా చిత్రితమవుతుంది. వాస్తవ జీవితం వైరుధ్యాలు, అసమానతలు, ఘర్షణలతో నిండి ఉంటుంది కాబట్టి, ఈ సంఘర్షణ లేమిని కేవలం కథన శైలిగా మాత్రమే కాక, ఒక నిర్దిష్ట జీవన క్రమాన్ని సహజంగా అంగీకరింపజేసే నిర్మాణంగానూ చూడవచ్చు. 'ఒక రోజెళ్ళిపోయింది' కళాత్మకంగా అందమైన కథ. అయినా అది ఒక నిర్దిష్ట జీవన విధానాన్ని ఆదర్శంగా చూపిస్తుందా, లేక అప్పటి జీవన నిర్మాణాన్ని ప్రశ్నించరాని ఆదర్శంగా పునరుత్పత్తి చేస్తుందా? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఈ కథపై విమర్శ చేయడం అంటే పిచ్చయ్య వ్యక్తిత్వాన్ని తక్కువ చేయడం కాదు. ఆయన వ్యక్తిగతంగా ప్రశాంతుడు, నిరాడంబరుడు, ఎవరినీ నొప్పించని మనిషి కావచ్చు. కానీ వ్యక్తి మంచితనాన్ని, అతడు భాగమైన సామాజిక వ్యవస్థ న్యాయబద్ధతను కలిపి చూడాలి. సాహిత్య విమర్శ లక్ష్యం వ్యక్తులను తీర్పు చేయడం కాదు; వారి జీవితం సహజంగా కనిపించేలా చేసిన విలువల వ్యవస్థను ప్రశ్నించడం. సాహిత్యం గతాన్ని భద్రపరచడానికి మాత్రమే కాదు; వర్తమానాన్ని ప్రశ్నించి, భవిష్యత్తును మరింత మానవీయంగా నిర్మించడానికి ఉపయోగపడాలి. గొప్ప సాహిత్యం రెడీమేడ్ సమాధానాలు ఇవ్వదు. అది ప్రతి కొత్త చారిత్రక సందర్భంలో మనం సహజమని నమ్మిన విలువలను, నిర్మాణాలను తిరిగి పరిశీలించే విమర్శనాత్మక దృష్టిని పెంపొందిస్తుంది.

# వందేళ్ళ స్ఫూర్తి సంకేతం

తెలంగాణ నేలపై గోలకొండ పత్రిక వెలువడి ఈ ఏడాదికి వందేళ్లవుతోంది. 1926 నుంచి 1966 వరకు తొలుత అర్ధవార పత్రికగా, ఆ తర్వాత దినపత్రికగా నాలుగు దశాబ్దాలపాటు ప్రచురితమవుతూ అప్పటి తెలంగాణ జన జీవనాన్ని నమోదు చేసింది. ఈ నలభై ఏళ్ల కాలంలో తెలంగాణలో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు జరిగాయి. ఈ కాలంలోనే ఆంధ్ర జనసభ, ఆ తర్వాత ఆంధ్ర మహాసభ స్థాపన జరిగింది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల విస్తరణ జరిగింది. భాగ్యరెడ్డి వర్మ, అరిగె రామస్వామిలాంటి నేతలు దళిత జనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టారు. కొమురం భీం నాయకత్వాన సాయుధ పోరాటం, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వీరోచిత రైతాంగ సాయుధ పోరాటం నడిచాయి. యూనియన్ సైన్యాలకు నిజాం లొంగుబాటు, రెండేళ్ల తర్వాత ఎన్నికల ద్వారా ప్రజా ప్రభుత్వ ఏర్పాటు జరిగాయి. అంతేగాక తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలన్న ఆందోళనలు, హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాల విలీనం కూడా ఈ సమయంలోనే జరిగాయి. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి కారణమైన పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘనలు ఈ కాలంలోనే చోటుచేసుకున్నాయి. ఇలాంటి అనేక చారిత్రక ఘటనలను గోలకొండ పత్రిక రికార్డు చేసింది. నిజాం పాలనలో ఉర్దూ, మరాఠీ భాషాధిపత్యంతో తెలుగువారి అస్తిత్వం, ఆత్మగౌరవం దెబ్బతిని నిజాం రాష్ట్రాంధ్ర జనసంఘం పురుడు పోసుకున్నాక.. ఆ సంస్థ కార్యక్రమాల ప్రచారం కోసం, తెలుగు భాషా సేవ కోసం 1922లో నల్లగొండ కేంద్రంగా షబ్నవీస్ వెంకటరామనరసింహారావు ఆధ్వర్యంలో 'నీలగిరి', ఆ తర్వాత ఇనుగుర్తి నుంచి ఒద్దిరాజు సోదరుల ఆధ్వర్యంలో 'తెనుగు పత్రిక'లు వారపత్రికలుగా వెలువడ్డాయి. ఈ పత్రికల నిర్వహణ కష్టంగా ఉన్న సమయంలో తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవానికి, పునర్వికాసానికి దోహదపడేందుకు 'గోలకొండ' పత్రిక 1926 మే 10న ప్రారంభమైంది. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఉన్న సురవరం ప్రతాపరెడ్డి అప్పటి హైదరాబాద్ కొత్వాల్ (సిటీ పోలీస్ కమిషనర్) రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో ఈ పత్రికకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. పత్రిక తొలి సంచికలో సురవరం ప్రతాపరెడ్డి 'స్వవిషయం' పేర రాసిన వ్యాసంలో నాటి పత్రికా రంగం పరిస్థితి స్పష్టంగా అవగతమవుతుంది. "అనేక విఘ్న ప్రతిబంధముల కోర్చి యెట్టకేలకు గోలకొండ పత్రికనాంధ్ర జనులకు సమర్పించుకొనగలిగితిమి. ఇదివరకే విన్నవించిన రీతి పత్రిక యొక్క ముఖ్యోద్దేశం జన సేవయే గానీ తదితరమేదీయు గాదు. ప్రస్తుతం నిజాం రాష్ట్రమునకు 65 లక్షల కన్నానెక్కువగా ఆంధ్రులుండగా రెండు వార పత్రికలు మాత్రమే ఉండుట గొప్ప లోటు. ఒక చిన్న తిరువాన్కూర్ సంస్థాన మందు నూర్లకొలది నానావిధ పత్రికలుండ హైదరాబాద్ లోని యాంధ్రులకై మూడో పత్రిక ప్రచారం చేసినందులకు మేం చింతింపము" అని పేర్కొన్నారు. నిజాం రాష్ట్రంలో ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ప్రజా చైతన్యాన్ని రగలించడం, తర్వాత కాలంలో దానికి నాయకత్వం వహించడంలో ఆంధ్ర మహాసభ నిర్వహించిన పాత్ర అపూర్వమైంది. తెలంగాణ ఆంధ్రమహాసభ తొలి సమావేశం మెదక్ జిల్లా జోగిపేటలో నిర్వహించగా, సభకు గోలకొండ పత్రిక సంపాదకుడిగా ఉన్న సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రతాపరెడ్డి ఈ ఉద్యమానికి నాయకత్వ బాధ్యతలు చేపట్టడం వల్ల సహజంగానే గోలకొండ పత్రిక ఆంధ్ర మహాసభకు ఒక ప్రచార సాధనంగా పనిచేసింది. అందుకే ఆంధ్ర మహాసభలో జరిగిన ప్రతి పరిణామం, ప్రతి సమావేశం, తీర్మానం ఈ పత్రికలో వార్తలుగా మారాయి. వెట్టిచాకిరీ, కొన్ని సాంఘిక దురాచారాలు, మామూళ్లు, ప్రభుత్వాధికారుల జులుం, గ్రంథాలయోద్యమం, రాత్రి పాఠశాలలపై ప్రత్యేక




వ్యాసాలు, వార్తలు వచ్చాయి. గోలకొండ పత్రికలో అప్పటికే మద్రాస్ నుంచి వెలువడుతున్న కృష్ణా, ఆంధ్ర పత్రికల తరహాలోనే గ్రామ స్థాయి వార్తలు మొదలు అంతర్జాతీయ వార్తల వరకు ప్రాచుర్యం కల్పించారు. జాబులు శీర్షికతో పాఠకులు గోలకొండ సంపాదకుడికి లేదా నిజాం ప్రభువుకు సమస్యలపై చేసిన విజ్ఞాపనలను ప్రచురించేవారు. అలాగే స్థానిక వృత్తాంతములు, తెలంగాణా వార్తలు, రాష్ట్రీయ వార్తలు, పల్లెటూరి ప్రజల నివేదనం, గ్రామ సమాచారములు అనే శీర్షికల కింద గోలకొండ పత్రిక విలేఖరులు, పాఠకులు రాసిన వార్తలను అచ్చువేసేవారు. శిథిలదశలో ఉన్న తాళపత్ర గ్రంథాలతోపాటు కాలగర్భంలో కలిసిపోయే అవకాశమున్న శాసనాల పరిరక్షణను కూడా గోలకొండ పత్రిక భుజానికెత్తుకుంది. గుప్తంగా ఉన్న చరిత్రను బయటితీసేందుకు ఇతోధికంగా కృషి చేసింది. 'ఆంధ్ర విజ్ఞాన ప్రియులకు విజ్ఞాపనం' శీర్షికతో తాళపత్ర గ్రంథాల సేకరణ కోసం సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ పత్రికలో రాసిన వ్యాసం ఆలోచింపచేస్తుంది. 1927 మే 28న శేషాద్రి రమణకవులు తాళపత్ర గ్రంథాల సేకరణ, శాసనాల పరిశోధనకు మహబూబ్‌నగర్‌కు ప్రయాణమైనట్లు వార్తను ప్రచురించడం, వారికి జిల్లాలోని పండితులు సహకరించాలని పత్రికాముఖంగా విజ్ఞప్తి చేయడం తెలంగాణ చరిత్ర పరిశోధనకు ఆ పత్రిక ఎంత బాధ్యతాయుతంగా పని చేసిందో అర్థమవుతుంది. గోలకొండ పత్రికలో చరిత్ర, పరిశోధనకు సంబంధించి లభిస్తున్న వ్యాసాల్లో ప్రధానంగా కాకతీయుల పాలన విశేషాలు, తెలంగాణలో ప్రముఖ పట్టణాలు, గ్రామాల చారిత్రక నేపథ్యం, ఆలయాల స్థల పురాణాలు, ప్రాచీన కాలం నాటి శాసనాలు, కోటలు, దుర్గాల చరిత్ర, పరిశోధన చేస్తున్న వ్యక్తులు, సంస్థల కృషి తదితర అంశాలు కనిపిస్తాయి. తెలంగాణలోని లక్ష్మణరాయ పరిశోధక మండలి, వరంగల్ కేంద్రంగా స్థాపితమైన ఆంధ్ర చారిత్రక పరిశోధక మండలి ఆధ్వర్యంలో జరిగిన పరిశోధనలను గోలకొండ పత్రిక ఎప్పటికప్పుడు ప్రచురిస్తూ తెలంగాణ ప్రజలు తమ ప్రాంత చరిత్రను తెలుసుకునేలా చేసింది. 1930వ దశకంలో బాల్య వివాహాలకు మద్దతుగా సనాతనుల సభలు, సమావేశాలు, వారి వాదనలను 'దివ్యవాణి' అనే పత్రిక ఎక్కువగా ప్రచారం చేసేది. ఇందులో వచ్చే వ్యాసాలను ఖండిస్తూ రాసిన అభిప్రాయాలు గోలకొండ పత్రికలో అచ్చయ్యేవి. హిందూ మతంలోని కుల వ్యవస్థలోని రుగ్మతలను గురించి చెప్పిన సురవరం ప్రతాపరెడ్డి ప్రపంచంలోని అన్ని మతాల గుట్టును కూడా విప్పారు. 'మతము వలన ప్రపంచమునకు ఏమి లాభం?' (1932, అక్టోబర్ 22) శీర్షికతో ఆయన వ్యాసం రాశారు. దేవుడి పేర వంచించుటే కాదు.. బెదిరింపులకు కూడా దిగుతున్నారని ఆ వ్యాసంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా 'అసహనం' గురించి జరుగుతున్న చర్చ మనందరికీ తెలిసిందే. సురవరం ప్రతాపరెడ్డి 90 ఏళ్ల ఆ చర్చను ప్రారంభించాడంటే ఆశ్చర్యం కలగకమానదు. 'నిజాం రాష్ట్రమునందు ఆంధ్ర కవులే పూజ్యము' అంటూ గోలకొండ భావ సంవత్సరాది సంచికలో ముడుంబై వెంకటరాఘవాచార్యులు అనే రచయిత తన వ్యాసంలో చేసిన ప్రకటనకు సమాధానంగా, తెలంగాణ ఆత్మగౌరవ ప్రకటనగా 354 మంది కవుల కవిత్వంతో గోలకొండ కవుల సంచిక వెలువడిన విషయం తెలిసిందే. తెలంగాణ సాహిత్య చరిత్రలో మైలురాయిగా నిలిచిన గోలకొండ కవుల సంచికను తీసుకురావాలన్న సురవరం ప్రతాపరెడ్డి ఆలోచనకు గోలకొండ పత్రికే వేదికగా మారింది. ఈ సంచికకు సంబంధించిన పనులన్నీ హైదరాబాద్ ట్రూప్ బజార్ లోని గోలకొండ పత్రిక కార్యాలయం కేంద్రంగానే సాగాయి. అంతేగాక సాహిత్య చరిత్రలలో తెలంగాణ సాహిత్యానికి దక్కని చోటు గురించిన ఆందోళన, ఆలోచనలకు ప్రారంభం కూడా ఆయనే. కురుగంటి సీతారామయ్య సంపాదకత్వంలో వచ్చిన 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు' సమీక్ష ద్వారా ఆయన ఆ పని ప్రారంభించారు. నిజాం పాలన తర్వాత తెలంగాణ నుంచి కథలు పెద్దగా రాలేదని, 1970 నుంచే విస్తృతంగా వచ్చిందనే అవగాహన కొందరు సాహిత్యకారుల్లో ఉంది. కానీ సాహిత్యంలో స్తబ్ద కాలంగా పరిగణించబడుతున్న 1955--66 మధ్య పదేళ్ల కాలంలో 224 స్వతంత్ర కథలు గోలకొండ పత్రికలో అచ్చవడం విశేషం. గోలకొండ పత్రికలో 333 స్వతంత్ర కథలు, 82 అనువాద కథలు 82 కలిపి 415 కథలు కనిపించాయి. స్వతంత్ర కథల్లో 21 మాత్రమే మహిళలు రాసినవి ఉన్నాయి. తెలుగులో ఇప్పటి వరకు 'వెట్టి మాదిగ' (1931, భాగ్యనగర్ పత్రిక) కథ రాసిన భాగ్యరెడ్డి వర్మను తొలి దళిత కథకుడిగా చెప్పుకుంటున్నాం. కానీ అంతకుముందే యానంకు చెందిన శ్రీనివాసులు అనే దళిత విద్యార్థి దళిత సమస్యపై రాసిన 'నేరేడు పండ్లకంటు' అనే కథ 1928 ఫిబ్రవరి 15న గోలకొండ పత్రికలో ప్రచురితమైంది. గోలకొండ పత్రికపై నేను చేసిన పరిశోధనలో 22 జానపద గేయాలు, 156 పద్య కవితా ఖండికలు, 228 వచన కవితలు, 22 అనువాద కవితలు కలిపి మొత్తం 384 కవితలు గుర్తించాను. తెలంగాణలో గ్రంథాలయోద్యమం, ఆంధ్రోద్యమం జమిలిగా నడిచాయి. వాటితోపాటు గోలకొండ పత్రిక కూడా కలిసే నడిచింది. అందువల్ల పై రెండు ఉద్యమాలను గురించిన సమాచారాన్ని ఈ పత్రిక చాలా వరకు నమోదు చేసింది. స్త్రీ సమస్య, కుల సమస్య 1920ల నాటికే తెలంగాణలో చర్చనీయాంశాలు. సామాజిక దురాచారాలు, అస్పృశత, మద్యపానం, వెట్టిచాకిరీ విధానంపట్ల వ్యతిరేకత నుంచి గోలకొండ పత్రికలో వచ్చిన కవిత్వం తెలంగాణలో సంస్కరణోద్యమం లేదనుకొనే వారికి గట్టి సమాధానమిస్తాయి. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత 1966 వరకు చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, తెలంగాణ నేతలకు తగ్గుతూ వచ్చిన ప్రాధాన్యం ఈ పత్రికను చదివితే అర్థమవుతుంది. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర రచనతోపాటు రాజకీయ, సామాజిక చరిత్ర రచనకు గోలకొండ పత్రిక సారవంతమైన వనరు. ఈ పత్రిక నిర్వహణ ద్వారా సురవరం ప్రతాపరెడ్డి వందేళ్ళ క్రితం నెలకొల్పిన విలువలు, ప్రమాణాలు ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయి.

# పారదర్శకంగా, వేగవంతంగా ఓటరు జాబితా

-ప్రత్యేక సవరణ పూర్తి చేయాలి
-అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు
-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

హంసకలం వార్త



నియోజకవర్గం పరిధిలోని బిజినపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బిజినపల్లి గ్రామంలోని జహంగీర్ బీ నివాసానికి వెళ్లిన జిల్లా కలెక్టర్, అక్కడ బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) శివలీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు ధృవీకరణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నేరుగా ఓటర్లతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరించాలి, ఏయే వివరాలను నమోదు చేయాలి, అవసరమైన పత్రాలను ఎలా జత చేయాలనే విషయాలను వివరించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించి, తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మండల తహసీల్దార్‌తో సమావేశమైన జిల్లా కలెక్టర్, మండలంలో మొత్తం ఉన్న ఓటర్ల సంఖ్య, ఇప్పటివరకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు, తిరిగి స్వీకరించిన ఫారాల సంఖ్య, ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. ప్రతి దశలో నమోదు ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతోందా లేదా అనే విషయాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ మునీరుద్దీన్ బిజినపల్లి మండల పరిధిలో మొత్తం 61,545 మంది ఓటర్లు ఉన్నారని, వారందరికీ 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టామని, ఇప్పటికే ఫారాలను ఓటర్ల నుంచి తిరిగి స్వీకరించే ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని, 2 వేలకుపైగా ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అదే సమయంలో అనర్హుల పేర్లను నిబంధనలకు అనుగుణంగా తొలగించే ప్రక్రియను కూడా అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను స్వయంగా కలుసుకుని ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడంతో పాటు, వాటిని పూర్తిగా నింపించి తిరిగి స్వీకరించాలని చెప్పారు. ఫారాల్లో నమోదైన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని, ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసి, వారికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని, ప్రతి అధికారి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఓటరు జాబితా మరింత పకడ్బందీగా రూపొందుతుందని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను పరిశీలించి, అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత సమయంలో బీఎల్ఓలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. తనిఖీ సందర్భంగా జిల్లా కలెక్టర్ బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న రికార్డులు, ఫారాల పంపిణీ రిజిస్టర్లు, స్వీకరణ వివరాలు, ఆన్‌లైన్ నమోదు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ మునీరుద్దీన్, ఎన్నికల విభాగం అధికారులు, మండల స్థాయి సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు శివలీల, సంబంధిత శాఖల అధికారులు బూతు లెవెల్ పార్టీల ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
-ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 68




హంసకలం వార్త

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 197 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, శిక్షణ డిప్యుటీ కలెక్టర్ హరిణి, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ సాయంతో పేదలకు ఊరట

-ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

హంసకలం వార్త

ఆపత్కాలంలో ఆరోగ్యం బాగాలేక ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఊరటనిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.సోమవారం ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో ఆయన 26వ విడుత సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపత్కాలంలో ఎంతో ఊరటనిచ్చే పథకమని అన్నారు. వైద్య చికిత్స కోసం అప్పుల పాలవకుండా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఇల్లంతకుంట మండలానికి సీఎంఆర్ఎఫ్ 26వ విడతలో 91 మందికి 26,17,000 రూపాయలు మంజూరు కాగా, వాటిని చెక్కుల రూపంలో అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు రావాలంటే నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారదర్శకంగా, సత్వరంగా చెక్కులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. బాధితులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సురేష్ కుమార్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, కె.అంతగిరి, మామిడి రాజు, నేరెళ్ల విజయ్ గౌడ్, నవీన్ కుమార్, బొలవేణి రమేశ్, కాత మల్లేశం, మాధవరెడ్డి,వంచ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నార . బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వ ంపల్లి సత్య నారాయణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆయన తరగతి గదిలో బాలికల ప్రతిభను పరీక్షించారు. పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకం కింద అందిస్తున్న భోజనాలు, వంటల రుచుల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికలతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. తెనుగువా నిపల్లెలో...



ఇల్లంత కుంట మండలం తెనుగువానిపల్లెలో చౌకధరల దుకాణాన్ని సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతే మా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నెలా నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు సరుకులు పొందాలని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యంతోపాటు ఇతర నిత్యవసర వస్తువులను ఈ-పాస్ యంత్రం ద్వారా పూర్తి తూకంతో అందించాలన్నారు. డీలర్లు తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే డీలర్‌షిప్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఆయన హెచ్చరించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో దొడ్డు బియ్యంతో పేదలు అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సన్న బియ్యం పంపిణీ చేయిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ, కార్డుల్లో పేర్ల తొలగింపు, చేర్పులు, తప్పుల సవరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

## శాస్త్రీయ పద్ధతులతో మామిడి సాగు చేయాలి

-జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ బి. సత్యప్రసాద్
-మామిడి సాగులో శాస్త్రీయ పద్ధతులు అవలంబించి నాణ్యమైన దిగుబడులు సాధించాలి
-రైతులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచన



హంసకలం వార్త

మామిడి సాగులో ఆధునిక, శాస్త్రీయ పద్ధతులను రైతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను సాధించవచ్చని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సోమవారం గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్ (శ్రీరాములపల్లి)లో నిర్వహించిన జిల్లాస్థాయి మామిడి వర్క్‌షాప్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. మామిడి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే శాస్త్రీయ సాగు విధానాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ఉద్యాన పంటల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ అధికారులు అందించే సాంకేతిక సూచనలు, శాస్త్రవేత్తల సలహాలను రైతులు సద్వినియోగం చేసుకుని సాగులో ఆధునిక విధానాలను అమలు చేయాలని అడ్లూరి కోరారు. మామిడి రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేపడితే అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటను పొందవచ్చన్నారు. చెట్ల కొమ్మల కత్తిరింపులు, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పురుగు మరియు వ్యాధుల నివారణ, కోత అనంతర నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. మామిడి సాగులో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. చెట్ల కత్తిరింపులు, సమతుల్య ఎరువుల యాజమాన్యం, పురుగు-వ్యాధుల నియంత్రణ, మందుల పిచికారీ, నీటి నిర్వహణ, కోత అనంతర జాగ్రత్తలు, నిల్వ, మార్కెటింగ్ అవకాశాలు తదితర అంశాలను వివరించారు. ఈ సూచనలు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని శాస్త్రవేత్త తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత, ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మామిడి రైతులు మరియు సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
-ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు..

హంసకలం వార్త

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్‌కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాధా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-పదవి విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించిన జిల్లా కలెక్టర్..
-జూన్ నెలలో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్
-కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్..



హంసకలం వార్త

ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడినదని, బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో జూన్ 30 నాటికి పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెనుబల్లిలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సయ్యద్ యూసుఫ్, రెవెన్యూ శాఖలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్.వి. నారాయణమూర్తి, హౌసింగ్ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన పి. సాయిరాం రెడ్డి, పశుసంవర్ధక శాఖ పరిధిలో మధిర ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎస్. చంద్ర భగీరథి దేవి, రెవెన్యూ శాఖలో గిర్దావర్‌గా పనిచేసిన అల్లం రవికుమార్, విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన షేక్ మదార్, ఇంటర్మీడియట్ విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన అయూబ్ ఖాన్, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన కె. వెంకన్న, గిరిజన సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేసిన షేక్ హసన్ పాషా, ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసిన తేజావత్ పెంటయ్య, జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేసిన ఎం. సిద్దిక్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడినదని, సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అంకితభావంతో సేవలందించిన ప్రతి ఉద్యోగి అభినందనీయుడని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయని పేర్కొన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని కోరుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

హంసకలం వార్త



రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు,ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25వ తేదీ నుండి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని,ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు.పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు వివరాలు నమోదు చేసిన పిదప తిరిగి తీసుకొని సంబంధిత బిఎల్ఓ యాప్ లో డిజిటైజేషన్ చేపట్టాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకు వాలంటీర్లను ఉపయోగించుకొని ఓటర్లకు సహాయ పడాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 వ తేదీ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.డిజిటైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని,ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తప్పుడు సమాచారం సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.డిజిటైజేషన్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు సహాయం అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో నేటి వరకు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేయడం జరిగిందని, 6.8 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని,వచ్చే సోమవారం నాటికి 50 శాతం డిజిటైజేషన్ పూర్తి చేస్తామని,పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందీగా చేపడతామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు,బూత్ స్థాయి ఏజెంట్లకు కార్యాచరణ ప్రకారంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని,జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హంసకలం వార్త



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కారా ్యలయాల భావన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య,వి.రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామపంచాయతీ చందనాపూర్ గ్రామవాసులు తమ గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో 136 రేషన్ కార్డులు ఉన్నాయని, స్థానికంగా రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.జైపూర్ మండలం రామారావుపేట గ్రామానికి చెందిన కడియాల పద్మ తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొనుటలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆలస్యం జరిగిందని, ఇప్పుడు ఇల్లు నిర్మించు కునేందుకు అనుమతి అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.నెన్నెల మండలం గంగారం గ్రామానికి చెందిన పాగిడి శోభ తాను ఏ ఎన్ ఎం, ఇంటర్,ఎం పి హెచ్ డబ్ల్యు అర్హత కలిగి ఉన్నానని,ప్రభుత్వ ఆసుపత్రిలో ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన కొలిపాక శ్రీనివాస్ తాము నివసిస్తున్న ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్ ప్రాంతానికి చెందిన బాసపోయిన రవీంద్ర కుమార్ తాను మంచిర్యాల జిల్లాలోని గరిమెళ్ళ గ్రామంలో కొనుగోలు చేసిన భూమికి ముటేషన్ ద్వారా పట్టా జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన రాచర్ల సంతోష్ తన తండ్రి పేరిట గ్రామ శివారులో భూమి ఉందని,ఆయన మరణించారని, ఇదే అదనుగా కొందరు భూమిని అక్రమంగా ఆక్రమించి పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని,ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.తెలంగాణ లైబ్రరీ సైన్స్ విద్యార్థులు -నిరుద్యోగుల సంఘం ప్రతినిధులు తమ దరఖా స్తులలో జిల్లా కేంద్ర గ్రంథాలయం,శాఖా గ్రంథాలయాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో లైబ్రరీ అండ్ పోస్టులను ప్రత్యక్ష పద్ధతిన డి ఎస్ సి ద్వారా భర్తీ చేయాలని కోరారు.భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలలో సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ... ప్రజావాణి కార్యక్రమంలో 79 దరఖాస్తులు అందాయని,ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకు ంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి...

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
-అందజేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని బీఎల్‌వోలు తిరిగి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి..
-పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పనులు మరింత వేగవంతం చేయాలి..

హంసకలం వార్త

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు/ జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి వీడియో సమావేశంలో పాల్గొనగా, జిల్లా కలెక్టరేట్ నుండి మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయిందని, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి వంటి పట్టణ ప్రాంతాల్లో పంపిణీ ఆశించిన స్థాయిలో లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారంలోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్లకు వెళ్లిన సమయంలో తాళం వేసి ఉంటే వాటిని 'అబ్సెంట్'గా నమోదు చేయాలని, అవసరమైతే తర్వాత మరోసారి సందర్శించి ఫారాలను అందజేయాలని సూచించారు. అందజేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తిరిగి సేకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్ర వ్యాప్తంగా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాన్ని ఎలా పూరించాలో వివరించడంలో ఇబ్బంది పడుతున్న బీఎల్‌వోలకు సూపర్‌వైజర్లు సహకరించాలని, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌వోలు) సూపర్‌వైజర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన చోట ఎక్స్పీరియన్స్ ఉన్న వాలంటీర్లను నియమించి బీఎల్‌వోలకు సహకారం అందించాలని తెలిపారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలపై తప్పనిసరిగా ఓటర్ల సంతకాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశించిన గడువుల్లోగా పూర్తి చేయాలని, అదే సమయంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో 99.5 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, ఇప్పటి వరకు 20.9 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. పనితీరు




బలహీనంగా ఉన్న బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) గుర్తించి, వారికి సూపర్‌వైజర్లను సహాయంగా నియమించినట్లు తెలిపారు. ఓటర్లకు అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లాలోని అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 5 శాతం చొప్పున ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ జరుగుతోందని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన ఓటర్లకు సంబంధిత ధృవీకరణ పత్రాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునేలా అధికారులు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారంలను గడువు లోపు అందించాలి

హంసకలం వార్త



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంను పూరించి, నిర్ణీత గడువు లోపు ప్రతి ఓటరు తప్పనిసరిగా బూత్ లెవెల్ అధికారికి అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు అందరూ విధిగా ఈ నెల 24వ తేదీ లోపు ఎన్యూమరేషన్ ఫారంను నింపి బీ.ఎల్.ఓలకు అందించాలన్నారు. లేని పక్షంలో ఆగస్టు 5న ప్రచురించే ఓటర్ల ముసాయిదా జాబితాలో పేరు కోల్పోతారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోకూడదని, అధికారులు ఎంత పెద్ద హోదాలో, ఏ స్థాయిలో ఉన్నా ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఎన్యూమరేషన్ ఫారం అందించాల్సిందేనని అన్నారు. జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాంతాలలో ఇప్పటికే ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. అయితే తీసుకున్న ఎన్యూమరేషన్ ఫారంలను తగిన వివరాలతో పూరించి, బీ.ఎల్.ఓలకు గడువు లోపు అందించడం ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ మేరకు ఓటర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని, వివిధ శాఖల జిల్లా అధికారులకు, మండల స్పెషల్ ఆఫీసర్లు అవకాశం మేరకు తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి, ఎస్.ఐ.ఆర్ అమలు తీరును, బీ.ఎల్.ఓల పనితీరును పరిశీలించాలని అన్నారు. కాగా, ఎన్యూమరేషన్ ఫారం భర్తీ విషయంలో, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ, తగిన సహకారం అందించేందుకు వీలుగా కలెక్టరేట్ లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఎన్నికల విభాగం పర్య వేక్షకుడు బాలరాజ్ ను ఆదేశించారు. ఇదిలాఉండగా, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ను క్రమం తప్పకుండా సందర్శించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థలను మొక్కుబడిగా సందర్శించకుండా, వాటి పనితీరును నిశితంగా పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్నది గమనించాలని అన్నారు. అధికారుల సందర్శనతో విద్యా సంస్థల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. ఓపెన్ బావులు వంటి ప్రమాదకర పరిస్థితులు నెలకొని ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థులు పాముకాటు, విష కీటకాల బారిన పడకుండా అన్నివిద్యా సంస్థల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంకిత భావంతో ఉత్తమ స్థాయిలో విధులు నిర్వర్తించే మండల స్పెషల్ ఆఫీసర్ ను ఎంపిక చేసి తగిన ప్రోత్సాహకం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వ భరోసా..

-ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో 300 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

-లబ్ధిదారులకు రూ. 88 లక్షల మేరకు ఆర్థిక చేయూత చెక్కుల పంపిణీలో పాల్గొన్న...

-డీసీసీ అధ్యక్షులు నూతి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, రాష్ట్ర మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డి, నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, తదితరులు.

హంసకలం వార్త



ఖమ్మం: ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్సలు పొందిన పేదల పక్షాన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా భరోసాగా నిలుస్తోందని కాంగ్రెస్ జిల్లా నాయకులు కొనియాడారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్) చెక్కులను సోమవారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, తదితరులు హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 300 మంది లబ్ధిదారులకు రూ. 88,78,600 మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి విశేష కృషి జరుగుతోందని అన్నారు. ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ఎంతో శ్రద్ధ చూపి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో.. ప్రజలకు ఆరోగ్య లబ్ధి చేకూరేలాగా ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.

**-లబ్ధిదారులకు భోజన సదుపాయం..**

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందేందుకు వచ్చిన లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేబోయిన నర్సింహారావు, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, సత్యనారాయణ రెడ్డి, నాయకులు కోసూరి శ్రీను, మల్లెల నాగేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర నేత హారికా నాయుడు, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు కొర్లపాటి అన్నపూర్ణ, శ్రీ కళా రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ అనుబంధ నాయకులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

హంసకలం వార్త



ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ..ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి,తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య,వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు,భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్,డిఆర్ఓ రాథోడ్ రమేష్ వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఆయా నిర్లక్ష్యంతో పేలిన రైస్ కుక్కర్

-కుక్కర్ పేలడంతో పిల్లలకు తీవ్ర గాయాలు

-వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

-పిల్లలను పరామర్శించిన బి డబ్ల్యు ఓ దమయంతి

-వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్

-నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆయాను తొలగించాలి

-చిన్నారుల తల్లిదండ్రుల డిమాండ్

హంసకలం వార్త

జిల్లాలోని కొల్లాపూర్ పట్టణంలోని 10వ వార్డులోని అంగన్వాడీ 18వకేంద్రంలో సోమవారం రైస్ కుక్కర్ పేలి పిల్లలకు తీవ్రంగా గాయాలయ్యాయి.గాయాలైన పిల్లలను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్ వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. విషయం తెలుసుకున్న జిల్లా జిల్లా ఐబో దమయంతి,సూపరిండెంట్ ప్రకాష్, CDPO మహేశ్వరి అక్కడికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐతే పిల్లలు ఉన్న చోటనే రైస్ కుక్కర్ ని ఉంచి తెరవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది అని దీనికి కారణం అయిన ఆయాపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు ఆయా నిర్లక్ష్యం



కారణంచే తమ పిల్లలకు గాయాలు అయ్యాయి అని వెంటనే ఆయాను తొలగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

హంసకలం వార్త



ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్జిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా,జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.మొత్తం 144 దరఖా స్తులు రాగా,సంబంధిత శాఖల అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ప్రజా వాణి కి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు .హైదరా బాద్ లో నిర్వహించే ప్రజావాణికి వచ్చే దరఖా స్తులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

**-సిరిసిల్ల,వేములవాడలో..**

సిరిసిల్ల,వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించి.ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.సిరిసిల్ల ప్రజావాణికి 4,వేములవాడ ప్రజావాణికి రెండు దరఖాస్తులు వచ్చాయి.వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి. పరిష్కరిం చాలని ఆదేశించారు.ప్రజావాణిలో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ,అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ,హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 24లోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

-పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పారదర్శకంగా చేపట్టాలి

-కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు

-జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

-జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా చర్యలు

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



హంసకలం వార్త

రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సర్వే (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, ముఖ్యంగా ఫారాల డిజిటలైజేషన్ను ఈ నెల 24వ తేదీలోగా శాతం వందకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి పోలింగ్ కేంద్రంలో సుమారు 1000 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ పురోగతి, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఫారాల డిజిటలైజేషన్, రాజకీయ పార్టీలతో నిర్వహించాల్సిన సంప్రదింపులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైనదని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని, కొత్తగా రూపొందించే పోలింగ్ కేంద్రాల ముసాయిదాపై ఈ నెల 25వ తేదీ నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. నాగర్కర్నూల్ జిల్లాలో 99.24 శాతం ఫారాల పంపిణీ పూర్తి వీడియో కాన్ఫరెన్స్లో నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలోని నాగర్కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 880 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 7,31,632 మంది ఓటర్లు నమోదై ఉండగా, సోమవారం నాటికి 7,26,072 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని కలెక్టర్ వివరించారు. ఇంకా మిగిలిన 5,560 మంది ఓటర్లకు మంగళవారం సాయంత్రంలోగా ఫారాలు అందజేసి పంపిణీ ప్రక్రియను పూర్తిచేస్తామని చెప్పారు. ల్లాలో ఇప్పటివరకు 99.24 శాతం ఫారాల పంపిణీ పూర్తయిందని, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేస్తూనే, తిరిగి నింపిన ఫారాలను స్వీకరించి వాటిలోని వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ారాల స్వీకరణతో పాటు వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగవంతం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 34,293 మంది ఓటర్ల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడం జరిగిందని, ఇది మొత్తం ప్రక్రియలో 4.69 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఈ నెల 24వ తేదీ నాటికి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య సమతుల్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ నెల 25వ తేదీ నుంచి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల ముసాయిదాను సిద్ధం చేస్తామని వెల్లడించారు నాగర్కర్నూల్ కలెక్టరేట్ నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాటు కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, నాగర్కర్నూల్ ఆర్డీఓ అర్చన, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారత్‌లో టెస్లా కొత్త ఛార్జింగ్ కేంద్రం.. షాపింగ్ చేస్తూనే కారుకు ఛార్జింగ్.. పూర్తి వివరాలు ఇవే!




ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ టెస్లా, భారత్‌లో తన ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తర భారతదేశంలోనే మొట్టమొదటి ఇన్-మాల్ ఛార్జింగ్ కేంద్రాన్ని నేడు ఢిల్లీలో ప్రారంభించినట్లు ప్రకటించింది. ఢిల్లీలోని నెక్సస్ సెలెక్ట్ సిటీవాక్ మాల్‌లో ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. దీంతో వినియోగదారులు షాపింగ్ లేదా డైనింగ్ చేసే సమయంలోనే తమ టెస్లా కార్లకు ఛార్జింగ్ పెట్టుకునే వీలు కలుగుతుంది. ఈ కొత్త ఛార్జింగ్ కేంద్రంలో 11 కిలోవాట్ల సామర్థ్యం గల ఆరు డెస్టినేషన్ ఛార్జర్లను (ఏసీ) ఏర్పాటు చేసినట్టు కంపెనీ తెలిపింది. మాల్‌లోని ౹ా1 పార్కింగ్ ఏరియాలో ఉన్న ఈ ఛార్జర్లు 99.95 శాతం అప్‌టైమ్‌తో అత్యంత విశ్వసనీయంగా పనిచేస్తాయని పేర్కొంది. ఈ కొత్త కేంద్రంతో కలిపి భారత్‌లో టెస్లా నిర్వహిస్తున్న ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య 6కి చేరింది. దేశవ్యాప్తంగా ఇప్పుడు మొత్తం 20 సూపర్‌ఛార్జర్లు, 20 డెస్టినేషన్ ఛార్జర్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా, టెస్లా తన కొత్త మోడళ్లను ప్రదర్శించేందుకు జులై 6 నుంచి 10 వరకు అదే మాల్‌లో ఒక పాప్-అప్ స్టోర్‌ను కూడా నిర్వహిస్తోంది. ఇక్కడకు వచ్చే సందర్శకులు కొత్తగా విడుదలైన మోడల్ వై ఎల్, 2026 మోడల్ వై ప్రీమియం రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) కార్లను దగ్గర నుంచి చూసే అవకాశం ఉంది. సంస్థ ప్రతినిధులు ఈ కార్ల ఫీచర్లను వివరించడంతో పాటు, టెస్ట్ డ్రైవ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు.

**-కొత్త మోడళ్ల వివరాలు:**

మోడల్ వై ఎల్ ఆరు సీట్ల సామర్థ్యంతో, ఆల్-వీల్ డ్రైవ్ ఆప్షన్‌తో వస్తుంది. మూడు వరుసల సీటింగ్ లేఅవుట్ ఉన్న ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఒక్కసారి ఛార్జింగ్‌తో 681 కిలోమీటర్ల (డబ్ల్యూఎల్‌టీపీ) రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఇది కేవలం 5 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని ప్రారంభ ధర రూ. 61.99 లక్షలుగా ఉంది.

## అక్రమ వీడియోల తొలగింపుపై హైకోర్టుకు గూగుల్ కీలక వివరణ




కోర్టు విచారణలకు సంబంధించిన అనధికారిక రికార్డింగులను యూట్యూబ్‌లో అప్‌లోడ్ కాకుండా ముందస్తుగా పర్యవేక్షించడం లేదా వాటిని తొలగించడం సాధ్యం కాదని టెక్ దిగ్గజం గూగుల్ ఢిల్లీ హైకోర్టుకు స్పష్టం చేసింది. ఇది చట్టపరంగా తప్పనిసరి కాదని, సాంకేతికంగానూ అసాధ్యమని పేర్కొంటూ ఈ మేరకు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఎక్సైజ్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్ కోర్టు విచారణకు హాజరైన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై న్యాయవాది వైభవ్ సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ, కోర్టు విచారణలకు సంబంధించిన అనధికారిక రికార్డింగులను అరికట్టేలా సోషల్ మీడియా వేదికలను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై స్పందిస్తూ గూగుల్ తన వాదనలను వినిపించింది. పిటిషనర్ గుర్తించిన నిర్దిష్ట వీడియోలను ఇప్పటికే తొలగించామని, భారత్‌లో బ్లాక్ చేశామని గూగుల్ వెల్లడించింది. అయితే, తమ ప్లాట్‌ఫామ్‌లో ప్రతిరోజూ అప్‌లోడ్ అయ్యే లక్షలాది వీడియోలను పరిశీలించి, వాటిలో కోర్టు విచారణలకు సంబంధించిన వాటిని గుర్తించడం సాధ్యం కాదని పేర్కొంది. ఏదైనా కంటెంట్ చట్టబద్ధతను న్యాయస్థానాలే నిర్ధారించాలని, కేవలం ఓ మాధ్యమంగా ఉన్న తాము ఆ నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేసింది. నిర్దిష్ట యూఆర్ఎల్‌లతో కోర్టు ఆదేశాలు జారీ చేస్తే తప్ప, కంటెంట్‌ను తొలగించలేమని గూగుల్ తన అఫిడవిట్‌లో వివరించింది. న్యాయవ్యవస్థ ప్రయోజ నాల దృష్ట్యా అనధికారిక రికార్డింగ్‌ల అంశంపై సమర్థవంతమైన నియంత్రణ అవసరమని గతంలో హైకోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. తాజా పరిణామం న్యాయవ్యవస్థ పవిత్రతను కాపాడటంలో ఎదురవుతున్న సవాళ్లను, టెక్ ప్లాట్‌ఫామ్‌లు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక ఇబ్బందులను స్పష్టం చేస్తోంది.

## మారుతి కార్లపై జూలై డిస్కౌంట్లు- విక్టోరిస్‌పై రూ. 2 లక్షల వరకు బెనిఫిట్స్!




దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి, జూలై నెలకు గాను తన ఎరీనా డీలర్‌షిప్ నెట్‌వర్క్‌లోని పలు ప్రముఖ మోడళ్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను ప్రకటించింది. పోటీ మార్కెట్లో విక్రయాల జోరును కొనసాగించేందుకు కంపెనీ ఈ ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ దఫా అందిస్తున్న రాయితీలలో 'మారుతి విక్టోరిస్' ఎస్‌యూవీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ నెలలో విక్టోరిస్ ఎస్‌యూవీపై గరిష్ఠ ప్రయోజనాలను కల్పిస్తున్నారు. ముఖ్యంగా సీఎన్‌జీ వేరియంట్లపై ఎక్స్ఛేంజ్ బెనిఫిట్స్‌తో కలిపి రూ. 2 లక్షల వరకు లబ్ధి పొందే అవకాశం ఉందని సమాచారం. ఇక పెట్రోల్, హైబ్రిడ్ వేరియంట్లపై ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ రివార్డులు, కార్పొరేట్ స్కీమ్‌ల రూపంలో రూ. 60,000 నుంచి రూ. 90,000 వరకు డిస్కౌంట్లు లభిస్తున్నాయి. ఎరీనా నెట్‌వర్క్‌లోని ఇతర మోడళ్లపై కూడా సంస్థ భారీ ఆఫర్లను ప్రకటించింది. బ్రెజాపై రూ. 55,000 వరకు, ఆల్టో కే10 మరియు వ్యాగన్ ఆర్‌లపై రూ. 52,500 వరకు, స్విఫ్ట్‌పై రూ. 45,000 వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నారు. ఎస్-ప్రెసో, సెలెరియో, ఈకో వంటి మోడళ్లపై రూ. 37,500 వరకు రాయితీలు ఉన్నాయి. అయితే, అత్యంత ప్రజాదరణ పొందిన డిజైర్, ఎర్టిగా మోడళ్లపై ఈ నెలలో ఎటువంటి ఆఫర్లు లేవని కంపెనీ స్పష్టం చేసింది. వర్షాకాలంలో విక్రయాలను పెంచుకోవడంతో పాటు స్టాక్‌ను క్లియర్ చేసుకునే వ్యూహంలో భాగంగా మారుతి ఈ నిర్ణయం తీసుకుంది. నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ రివార్డుల రూపంలో ఈ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే, ఈ ప్రయోజనాలు నగరం, డీలర్‌షిప్ మరియు స్టాక్ లభ్యతను బట్టి మారే అవకాశం ఉంటుంది. కావున, కొనుగోలుదారులు పూర్తి వివరాల కోసం సమీపంలోని ఎరీనా షోరూమ్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

## తండ్రికి తగ్గ తనయుడు- శ్రీలంకపై అన్వయ్ ద్రవిడ్ మెరుపు ఇన్నింగ్స్- త్రుటిలో సెంచరీ మిస్!

భారత క్రికెట్ దిగ్గజం, 'ది వాల్' రాహుల్ ద్రవిడ్ క్రికెట్ వారసత్వాన్ని ఆయన చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ ఘనంగా ముందుకు తీసుకెళు తున్నాడు. శ్రీలంక అండర్-19 జట్టుతో నేడు జరిగిన రెండో యూత్ వన్డేలో ఈ యువ వికెట్ కీపర్-బ్యాటర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. మహింద రాజపక్స అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కేవలం 67 బంతుల్లోనే 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 87 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 19వ ఓవర్ ముగిసేసరికి 81 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్, మరో బ్యాటర్ అర్జున్ రాజ్‌పుత్ (76 పరుగులు) తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 145 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. ముఖ్యంగా అన్వయ్ దూకుడుగా ఆడుతూ కేవలం 47 బంతుల్లోనే తన తొలి యూత్ వన్డే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని దూకుడు చూసి శతకం ఖాయమనిపించినా, శ్రీలంక లెఫ్ట్ ఆర్మ్ పేసర్ గిమ్హాన్ మెండిస్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. 129.85 స్ట్రైక్ రేట్‌తో ఆడిన అన్వయ్ ఇన్నింగ్స్ జట్టు స్కోరును పరుగులు పెట్టించింది. అర్జున్ రాజ్‌పుత్ కూడా 81 బంతుల్లో 76 పరుగులు చేసి రాణించాడు. అయితే, దిమంత మహవితాన అద్భుతమైన త్రోకు అతను రనౌట్‌గా వెనుదిరిగాడు. కీలక భాగస్వామ్యం విడిపోయిన తర్వాత భారత ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. 263 పరుగుల వద్ద ఏడో వికెట్‌గా అన్వయ్ ఔటైన తర్వాత, భారత టెయిలెండర్లు చేతులెత్తేశారు. కేవలం 22 పరుగుల వ్యవధిలో చివరి మూడు వికెట్లు కోల్పోయి 47.2 ఓవర్లలో 285 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో గిమ్హాన్ మెండిస్ 41 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి భారత్‌ను కట్టడి చేశాడు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉంది. తొలి మ్యాచ్‌లో 321 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇటీవల వినూ మన్కడ్ ట్రోఫీలో కర్ణాటక జట్టుకు కెప్టెన్‌గా




వ్యవహరించిన అన్వయ్, ఆ టోర్నీలో 220 పరుగులు చేసి మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఈ ప్రదర్శనతో రాబోయే అండర్-19 ప్రపంచ కప్‌కు ఎంపికయ్యే అవకాశాలను మరింత మెరుగుపరుచుకున్నాడు. కాగా, అన్వయ్ అన్నయ్య సమిత్ ద్రవిడ్ కూడా ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపికైనా మోకాలి గాయం కారణంగా దూరమయ్యాడు.

## ఆసీస్ నిలకడే ఆ జట్టును విజేతగా నిలిపింది: సచిన్

స్పోర్ట్ డెస్క్:

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2026లో ఆస్ట్రేలియా జట్టు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ జగజ్జేతగా నిలిచింది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన హోరాహోరీ ఫైనల్ పోరులో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి, రికార్డు స్థాయిలో 7వ సారి ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ఆసీస్ మహిళల జట్టు ఓటమి ఎరుగకుండా అజేయంగా సాగడం విశేషం. ఆస్ట్రేలియా అద్భుత విజయాలపై భారత క్రికెట్ దిగ్గజం, గాడ్ ఆఫ్ క్రికెట్ సచిన్ టెండూల్కర్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా ప్రత్యేకంగా అభినందించారు. 'మరో ప్రపంచకప్ టైటిల్ సాధించిన ఆస్ట్రేలియా జట్టుకు అభినందనలు. టోర్నీలో వారి జైత్రయాత్ర.. వారు విభిన్న పరిస్థితులను ఎంత చక్కగా అధిగమించారో, ఎంత నిలకడగా రాణించారో చెప్తోంది. ఇలాంటి స్థిరత్వమే ట్రోఫీలను తెచ్చిపెడుతుంది. ఆసీస్ నిలకడే.. ఆ జట్టును ఛాంపియన్‌గా నిలిపింది' అంటూ సచిన్ ప్రశంసించారు. ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి కేవలం 150 పరుగులకే కుప్పకూలింది.




అనంతరం 151 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా కేవలం 17.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది.

# స్పోర్ట్స్

## వైభవ్ అరంగేట్రంలో జాప్యంపై స్పందించిన బీసీసీఐ



స్పోర్ట్స్ డెస్క్:

భారత క్రికెట్‌లో ఒక అద్భుతమైన మైలురాయి నమోదైంది. బీహార్‌కు చెందిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి, సరికొత్త చరిత్ర సృష్టించాడు. మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో తుది జట్టులో స్థానం దక్కించుకున్నాడు. దీంతో అతి పిన్న వయసులోనే భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆటగాడిగా వైభవ్ నిలిచాడు. టీమిండియాలోకి వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం విషయంలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్?లపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. కావాలనే వైభవ్ ఎంట్రీని ఆలస్యం చేస్తున్నారంటూ వారిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైభవ్ విషయంలో ఇంతటి పక్షపాతం ఎందుకంటూ ప్రశ్నించారు. తాజాగా వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంలో జాప్యంపై బీసీసీఐ స్పందించింది. అలానే గంభీర్, అయ్యర్‌లపై వస్తున్న విమర్శలపై కూడా స్పందించింది. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వైభవ్‌కు అభినందనలు తెలుపుతూ విమర్శలకు చెక్ పెట్టారు. 'బీసీసీఐ ఎప్పుడూ ప్రతిభకే ప్రాధాన్యత ఇస్తుంది. ఎవరికీ అన్యాయం చేయదు. వైభవ్‌కు సరైన సమయంలోనే అవకాశం దక్కింది. జట్టు మేనేజ్‌మెంట్ తీసుకున్న ఈ నిర్ణయం అద్భుతమైనది. భవిష్యత్తులో అతను మరింత రాణించి జట్టులో స్థిరపడతాడనే నమ్మకం నాకుంది' అని శుక్లా పేర్కొన్నారు.

## ఏనుగు దంతాల కేసు: హైకోర్టు ముందుకు మోహన్‌లాల్ ఐటీ డిక్లేరేషన్ పత్రాలు



మలయాళ సూపర్ స్టార్, పద్మభూషణ్ మోహన్‌లాల్‌ను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ఏనుగు దంతాల అక్రమ నిల్వ కేసు కేరళ హైకోర్టులో సరికొత్త మలుపు తిరిగింది. గతంలో ఆయన ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన వాలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందుకు వచ్చింది. ఆ పత్రాల ప్రకారం... మోహన్‌లాల్ వద్ద కేవలం నాలుగు మాత్రమే కాకుండా, మొత్తం 10 ఏనుగు దంతాలతో పాటు దంతాలతో చేసిన మరో 13 కళాఖండాలు (విగ్రహాలు) ఉన్నాయి. ఈ వివరాలను ఆయన స్వయంగా వెల్లడించారు. 2011 జూన్ నెలలో మోహన్‌లాల్‌కు చెందిన ఇళ్లు, ఆఫీసులపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొచ్చిలోని ఆయన సొంత నివాసంలో నాలుగు ఏనుగు దంతాలు దొరికాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా ఇలాంటి నిషేధిత వస్తువులను దగ్గర ఉంచుకోవడం నేరం కావడంతో కేరళ అటవీ అధికారులు నాడు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం గత పదేళ్లుగా కోర్టు పరిధిలోనే నలుగుతోంది. మరోవైపు, మోహన్‌లాల్ ఎలాంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడలేదని ఆయన తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు. ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన ప్రత్యేక 'ఐవరీ అమ్నెస్టీ' పథకం కింద ఈ సమాచారాన్ని ముందే డిక్లేర్ చేశామని కోర్టుకు వివరించారు. అయితే, ఐటీ శాఖకు వివరాలు అందజేసినప్పటికీ... అటవీ చట్టాల ప్రకారం ఈ దంతాలను కలిగి ఉండటానికి అవసరమైన అధికారిక యాజమాన్య ధ్రువీకరణ పత్రాన్ని మోహన్‌లాల్ సకాలంలో పొందారా? లేదా? అనే లీగల్ పాయింట్‌పైనే ప్రస్తుతం హైకోర్టులో ప్రధానంగా విచారణ సాగుతోంది ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచుకోండి.

# 'సత్లుజ్' వివాదం.. సినిమాలో దేశ వ్యతిరేక శక్తులు దుర్వినియోగం చేసే సన్నివేశాలు?

**-జీ5 నుంచి 'సత్లుజ్' సినిమా తొలగింపు**

**-సినిమాలోని సమాచారాన్ని దేశ వ్యతిరేక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్న కేంద్ర ప్రభుత్వ వర్గాలు**

**-జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం**

**-జీ5 నిర్ణయంపై రాజకీయ విమర్శలు**

పంజాబీ నటుడు దిల్‌జిత్ దోసాంజ్ ప్రధాన పాత్రలో నటించిన 'సత్లుజ్' చిత్రాన్ని జీ5 ఓటీటీ వేదిక నుంచి తొలగించారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలను భారత్ వ్యతిరేక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్న ఆందోళనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ చిత్రం తొలుత 'పంజాబ్ 95' పేరుతో రూపొందింది. థియేటర్లలో విడుదలకు అనుమతి రాకపోవడంతో ఇటీవల 'సత్లుజ్' పేరుతో జీ5లో విడుదల చేశారు. అయితే విడుదలైన మరుసటి రోజే చిత్రాన్ని తొలగించారు. సినిమాలోని కొన్ని భాగాలపై గతంలోనే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అవే అంశాలు దేశ వ్యతిరేక శక్తులకు ఉపయోగపడే ప్రమాదం ఉందని భావించినట్లు పేర్కొన్నాయి. ఈ చిత్రం పంజాబ్‌లో ఉగ్రవాదం తీవ్రంగా ఉన్న సమయంలోని పరిస్థితుల ఆధారంగా తీశారు. అప్పుడు ఎన్‌కౌంటర్లు, మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిని వెలుగులోకి తీసుకువచ్చిన సామాజిక కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం ఆధారంగా సినిమాను తెరకెక్కించారు. చిత్రాన్ని తొలగించిన విషయాన్ని జీ5 అధికారికంగా ధ్రువీకరించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ సినిమా భారత్‌లో అందుబాటులో ఉండదని ప్రకటించింది. అయితే చిత్ర బృందానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేసింది. చట్టపరమైన అన్ని మార్గాలను అనుసరించి వీలైనంత త్వరగా సినిమాను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని జీ5 వెల్లడించింది. ఇక దిల్‌జిత్ దోసాంజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు. "చీకటిని నేను సవాల్ చేస్తున్నాను" అంటూ పోస్ట్ చేశారు. తర్వాత లైవ్‌లో మాట్లాడుతూ, ఒకసారి ఇంటర్నెట్‌లోకి వచ్చినది పూర్తిగా తొలగించలేరని అన్నారు. "నన్ను ఎంత ఇబ్బంది పెట్టినా పంజాబ్‌తోనే ఉంటాను" అని వ్యాఖ్యానించారు. సినిమా తొలగింపును ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ మల్విందర్ సింగ్ కాంగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ ఖైరా తప్పుబట్టారు. సరైన వివరణ లేకుండా సినిమాను తొలగించడం నిరాశ కలిగించిందని అన్నారు. 'సత్లుజ్' చిత్రం 2022లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)కి వెళ్లింది. అప్పట్లో 127 కట్‌లు సూచించారని చిత్ర నిర్మాతలు ఆరోపించారు. మూడు సంవత్సరాల తర్వాత ఓటీటీలో విడుదలైన ఈ చిత్రం మళ్లీ వివాదంలో చిక్కుకుంది.



# అఖిల్‌కు అభిమాని కొత్త పేరు 'నాగ అఖిల్' పేరు వెనుక ఇంత కథ ఉందా?

**-అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్**

**-అఖిల్‌కు 'నాగ అఖిల్' అని పేరు సూచించిన అభిమాని**

**-పేరులో నలుగురు కుటుంబ సభ్యుల ఆశీస్సులు ఉన్నాయన్న ఫ్యాన్**

**-సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అక్కినేని ఫ్యాన్ సెంటిమెంట్**

**-సినిమా హిట్టయితే ఈ పేరు నిలిచిపోతుందంటున్న నెటిజన్లు**

అక్కినేని యువ కథానాయకుడు అఖిల్ నటించిన తాజా చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తిరుపతిలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ అభిమానుల కోలాహలంతో అట్టహాసంగా జరిగింది. అయితే, ఈ వేడుకలో అఖిల్, నాగార్జున ప్రసంగాల కంటే ఓ అక్కినేని వీరాభిమాని చేసిన వినూత్న ప్రతిపాదన అందరి దృష్టినీ ఆకర్షించింది. తన అభిమాన హీరోకు కొత్త పేరును సూచిస్తూ, దాని వెనుక ఉన్న సెంటిమెంట్‌ను వివరించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమాని ప్రేమకు నిదర్శనం 'నాగ అఖిల్' సినిమా పరిశ్రమలో విజయం కోసం కొందరు నటులు తమ పేర్లలో మార్పులు చేసుకోవడం, అక్షరాలు జోడించుకోవడం సాధారణమే. కానీ ఇక్కడ ఓ అభిమానే స్వయంగా తన హీరోకు కొత్త పేరు పెట్టాలని సూచించడం ఆసక్తి రేకెత్తించింది. 'లెనిన్' ప్రీ-రిలీజ్ వేదికపై మాట్లాడిన ఆ అభిమాని, అఖిల్ పేరును 'నాగ అఖిల్'గా మార్చుకుంటే బాగుంటుందని సూచించాడు. కేవలం పేరు సూచించడంతోనే ఆగకుండా, దాని వెనుక ఉన్న బలమైన సెంటిమెంట్‌ను కూడా వివరించాడు. 'నాగ అఖిల్' అనే పేరులో అక్కినేని కుటుంబానికి చెందిన నలుగురు పెద్దల ఆశీస్సులు ఉన్నాయని తెలిపాడు. అతడి వివరణ ప్రకారం, 'నాగ' అనే పదం తాత అక్కినేని నాగేశ్వరరావు, తండ్రి నాగార్జున పేర్ల నుంచి స్ఫూర్తిగా తీసుకున్నదట. అలాగే, పేరులోని 'అ' అక్షరం నానమ్మ అన్నపూర్ణమ్మ, తల్లి అమల పేర్ల నుంచి వచ్చిందని చెప్పాడు. ఇలా నలుగురు కుటుంబ సభ్యుల దీవెనలు ఎల్లప్పుడూ అఖిల్‌తో ఉండాలనే గొప్ప ఉద్దేశంతో 'నాగ అఖిల్' అనే పేరును సూచించినట్లు ఆ అభిమాని చెప్పగానే ప్రాంగణం మొత్తం చప్పట్లతో మారుమోగింది. అక్కినేని కుటుంబంలో 'నాగ' అనుబంధం అక్కినేని కుటుంబంలో 'నాగ' అనే పదానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నుంచి మొదలుకొని నాగార్జున, నాగ సుశీల, నాగ చైతన్య వరకు కుటుంబంలోని చాలా మంది పేర్లలో 'నాగ' అనే పదం భాగమైంది. ఇప్పుడు అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ అఖిల్ పేరుకు కూడా 'నాగ'ను జోడించాలన్న అభిమాని సూచనకు సోషల్ మీడియాలో భారీ మద్దతు లభిస్తోంది. "పేరు చాలా బాగుంది", "అభిమాని ఆలోచన అద్భుతం" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కొందరైతే 'లెనిన్' చిత్రం బ్లాక్‌బస్టర్ విజయం సాధిస్తే ఈ కొత్త పేరు అఖిల్‌కు మరింతగా కలిసి వస్తుందని, అప్పుడు అదే పేరుతో పిలవడం మొదలుపెడదామని అభిప్రాయపడుతున్నారు.





## సెన్సార్ పనులు పూర్తి చేసుకున్న 'ఓ సుకుమారి' ఈ నెలలోనే రిలీజ్!

**-ఐశ్వర్య రాజేష్, తిరువీర్ జంటగా 'ఓ సుకుమారి'**

**-భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయం**


**-సినిమాకు U/A సర్టిఫికెట్ జారీ చేసిన సెన్సార్ బోర్డ్**

**-జులై 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల**

ఐశ్వర్య రాజేశ్, తిరువీర్ జంటగా నటించిన 'ఓ సుకుమారి' సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేసింది. ఫాంటసీ అంశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని జులై 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర రెడ్డి మూలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజకీయ నాయకుడు కావాలనుకునే ఓ యువకుడు, సుకుమారి (ఐశ్వర్య రాజేష్) అనే పల్లెటూరి అమ్మాయి ప్రేమలో పడతాడు. అయితే ఆమెను ఎవరు తాకినా షాక్ కొట్టడం అనే విచిత్రమైన సమస్య చుట్టూ కథనం హాస్యభరితంగా, ఆసక్తికరంగా సాగుతుందని తెలుస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ దశలో ఉంది. తెలుగుతో పాటు తమిళం, ఇతర భాషల్లోనూ ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. U/A సర్టిఫికెట్ రావడంతో ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని అంచనాలు నెలకొన్నాయి.

## సింగ్ గీతం ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తోంది!

సీనియర్ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన ప్రయోగాత్మక మ్యూజికల్ ఫాంటసీ చిత్రం 'సింగ్ గీతం' ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా జులై 9 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోపే ఈ చిత్రం డిజిటల్ ప్రీమియర్‌కు రానుండటం గమనార్హం. జూన్ 11,12 తేదీల్లో తెలుగు, తమిళ భాషల్లో విడుదలైన ఈ చిత్రం, వినూత్న కథనంతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. సంగీతం, ఫాంటసీ అంశాల మేళవింపుతో రూపొందిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. అయాన్, అహల్య, షాలిని ప్రధాన పాత్రలు పోషించగా, నాగ్ అశ్విన్ తన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, కేవీ అనుదీప్, రాహుల్ రవీంద్రన్, నివేదా పేతురాజ్ అతిథి పాత్రల్లో మెరిశారు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449